
# దొంగ




పోస్టు ఆఫీసులో అక్కౌంటు కాగితాలు, డబ్బుల సంచులు మొదలైనవి పంపడానికి ఎర్రసంచులు ఉపయోగిస్తారు. వీటిని 'అక్కౌంటు బాగ్స్' అంటారు.

వీటిని గట్టి ఎర్రని గుడ్డతో తయారుచేస్తారు. బియ్యం, కూరలు...వంటివి తీసుకెళ్లడానికి ఇవి వీలుగా ఉంటాయి. అందువల్ల, పోస్టాఫీసులో పనిచేసేవారు అప్పుడప్పుడు ఈ సంచుల్ని వాడుకుని తిరిగి తెచ్చేస్తుంటారు.

ఒకసారి పోస్టుమాస్టరుగారు– ఆఫీసులో ఉండాల్సిన ఈ ఎర్ర సంచులని తనిఖీ చేస్తే కొన్ని తక్కువ కనిపించాయి. వాటిని ఎవరో, ఆఫీసులో వాళ్ళే ఎత్తుకుపోతున్నారనే నిర్ణయానికి వచ్చారు ఆయన.

అయితే... ఎవర్ని అనుమానించడం? అందువల్ల తన క్రింద పనిచేసే సహాయక పోస్టుమాస్టర్లని, విడివిడిగా పిలిచి తను అనుమానిస్తున్న సంగతి చెప్పి వారి మీద ఓ కన్నువేసి ఉంచి, ఆ దొంగను పట్టివ్వడానికి సహాయపడవలసిందిగా కోరారు.

రామావతారం- ఆ ఆఫీసులో ఒక సహాయక పోస్టుమాస్టరు. ఆయన మహా ఉత్సాహవంతుడు. ఈ అవకాశం ఉపయోగించుకొని సంచుల దొంగను పట్టించి, పోస్టుమాస్టరుగారి, ఆపై అధికారుల మెప్పును పొందాలని తీర్మానించుకున్నాడు. 'మంగమ్మ శపథం' లాగా, నెల తెరక్కుండా దొంగని పట్టిస్తా' నని... శపథం చేసినంత పని చేశాడు.

అది చలికాలం. చలి బాగా ముదిరింది. ఐదు దాటేసరికే బాగా చీకటి పడిపోతోంది. అందరూ మఫ్లర్లూ, స్వెట్టర్లూ వేసుకొని కొంపలకి చేరుకుంటున్నారు. ఆఫీసు నుంచి ఒక్కొక్కరు బయటపడుతున్నారు.

సయ్యద్ అహ్మద్ తలకి మఫ్లర్ చుట్టుకుని, చేతిలో ఒక కాగితం పొట్లం పట్టుకొని ఇంటికి బయలుదేరాడు. అతను ఆ ఆఫీసులో క్లాస్‌ఫోర్ ఉద్యోగి.

రామావతరాం నిశితమైన చూపులు- సయ్యద్ అహ్మద్ చేతిలో ఉన్న పొట్లం మీద పడ్డాయి. ఆ పొట్లం ప్రక్కలనుంచి ఎర్రనివస్తువు కనిపిస్తోంది. సందేహం లేదు... అది ఆఫీసులోవాడే ఎర్రని అకౌంట్ బ్యాగ్!

అయితే... వీడేనన్నమాట ఆఫీసులో సంచులు ఎత్తుకుపోతోంది!

'దొంగ దొరికాడ'న్న సంతోషంతో వెంటనే అతని దగ్గరికి వెళ్లి, "నిన్ను పోస్టుమాస్టార్‌గారు పిలుస్తున్నారు. రా!" అన్నాడు.

'ఎందుకా... అని సయ్యద్ అహ్మద్ పోస్టుమాస్టరుగారి దగ్గరకు వెళ్లాడు.

అతని వెనకనే వచ్చి, "సార్ దొంగని పట్టేశాను" అంటూ గట్టిగా ఉత్సాహంతో అన్నాడు రామావతారం.

ఆ మాటవిని నలుగురూ బిలబిలలాడుతూ పోస్టుమాస్టర్‌గారి దగ్గర చేరారు.

పోస్టుమాస్టరుగారు రామావతారం వంక ప్రశ్నార్థకంగాచూశారు.

"వీడేసార్... మన ఆఫీసులో సంచులు కాజేస్తోంది!" అంటూ సయ్యద్ అహ్మద్ చేతిలోని పొట్లాం లాక్కొని, కాగితాన్ని ఊడదీశాడు రామావతారం.

అందులోంచి బయట పడింది సంచికాదు- ఎర్రని స్వెట్టరు!

అందరి నవ్వుల మధ్య కొయ్యబారిపోయాడు రామావతారం.

*– జలధి పత్రిక... 1 జూలై ' 78*